క్లుప్తంగా

వైభవంగా అష్టోత్తర శతనామావళి

ప్రత్తిపాడు రూరల్: ఉత్తరకంచి అభయాంజనేయ స్వామి ఆలయంలో పండితుడు చీకట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకొని అష్టోత్తర శతనామావళి వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు భారీ ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ముగిసిన ధనుర్మాస పూజలు

ఏలేశ్వరం: ధనుర్మాస పూజలు ముగిశాయి. ఈ సందర్భంగా లింగంపర్తిలో మంగళవారం సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు నగర సంకీర్తన చేసిన మహిళలతో పాటు పారాయణం చేసి ఆధ్యాత్మిక వేత్త ఆలమూరి సుబ్బారావును ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళలు గీతా పారాయణం చేశారు. కార్యక్రమంలో లొల్ల సత్యవతి, అమరావతి, పిండితాయరు, ముప్పిశెట్టి లక్ష్మీ, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

చలమయ్యకు స్వాగతం


చలమయ్యను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకుని తిరిగి విధుల్లో చేరిన వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్యకు మంగళవారం స్వాగతం పలికారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చలమయ్యకు శాలువ కప్పి పూలమాలలతో సన్మానించారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు దిలబర్‌హుస్సేన్, వాగు బలరామ్, పైల విజయ్, వీరరాఘవస్వామి, శ్రీధర్, చిరంజీవిరావు, వాసు, చిన్నారావు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రత్తిపాడు: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల రాజా తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి రక్తదానం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

రక్తహీనత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాయుడు

గోకవరం: గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికల్లో రక్తహీన తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి సీహెచ్‌ఓ మేరీకృప, ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం అనీమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా వైద్య శాఖ ఆధ్వర్యంలో కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, విద్యాశాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. దీనిలో భాగంగా డిపార్ట్‌మెంట్ల వారీగా చేయాల్సిన కార్యక్రమాల గూర్చి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. చెందుర్తి సెంటర్ వద్ద మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరిని ఐషర్ వ్యాన్ ఢీకొట్టడంతో శంఖవరం మండలం పాత వజ్రకూటానికి చెందిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలైనట్లు గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

కొత్తపల్లి: రోడ్డు ప్రమాదానికి కారణమైన ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 15వ తేదీన వాకతిప్పకు చెందిన పెదపాటి బాబులు పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో నడిచి వెళుతుండగా గోర్స జంక్షన్ వద్ద ఉన్న సత్తెమ్మతల్లి గుడి సమీపంలో మోటర్ సైకిల్‌పై ఒక వ్యక్తి వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బాబులుకు గాయాలయ్యాయి. దీనిపై ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై 19న సమావేశం

సామర్లకోట: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తుల నుంచి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు స్వీకరించడానికి ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు ఆలయ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసినట్టు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో ట్రస్టు బోర్డు సభ్యులు, భక్త సంఘం, దీపారాధన సంఘం సభ్యులు, రైతులు పాల్గొని సలహాలు ఇవ్వాలన్నారు.

పాడి పరిశ్రమకు ప్రోత్సాహం

- పలు పథకాలు ప్రవేశపెడుతున్న ప్రభుత్వం
- రాయితీపై పశువుల దాణా, యంత్రాలు
- త్వరలో అమలు కానున్న 'జగనన్న పాలవెల్లువ'


గోపాలపట్నంలో రైతులకు రాయితీపై అందిస్తున్న టీఎంఆర్ దాణా


జి.ముసలయ్యపేటలో రాయితీపై గడ్డికోత యంత్రం

తొండంగి: పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. పాడి రైతుల అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందిస్తోంది. ఇందులో భాగంగా పాలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని ప్రకటించింది. త్వరలో ఈ పథకం ప్రారంభం కానుంది. వాటి గురించి పలు విషయాలు తెలుసుకుందాం.

గ్రామాల్లోనే పశువైద్య సేవలు

గతంలో పశు వైద్యసేవలు పశుసంవర్ధ శాఖ ద్వారా కొన్ని గ్రామాలకు కలిపి సబ్ సెంటర్ల ద్వారా సేవలందించే వారు. పశువులకు వ్యాధులు సంక్రమిస్తే ఆయా సబ్‌సెంటర్లకు తీసుకెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గ్రామాల్లో ఆర్బీకేల అనుసంధానంగా గ్రామ సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు సేవలందిస్తున్నారు. వారు రైతుల ఇళ్లు, పొలాల్లో పశువుల షెడ్ల వద్దకు వెళ్లి పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నారు. మండల వ్యాప్తంగా రెండు వేల ఆవులు, 5,500 పాడి గేదెలు ఉన్నాయని మండల పశువైద్యాధికారి బి.చైతన్య తెలిపారు.

రాయితీలపై పరికరాలు

పాడి పశువుల్లో పాల ఉత్పత్తి, వ్యాధి నిరోధక శక్తిని పెంచడం, వ్యాధులకు గురి కాకుండా పోషకాహారాన్ని అందించేందుకు సమీకృత దాణాను ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది. 200 కిలోల టీఎంఆర్ దాణా ప్యాకెట్ ధర మార్కెట్‌లో రూ.3160 ఉండగా సుమారు 58 శాతం రాయితీపై రూ.1300 అందిస్తోంది. పశువులకు గడ్డి మేత మేసేప్పుడు సులభంగా తినేందుకు గడ్డి కోత యంత్రం (చఫ్ కట్టర్) మార్కెట్ ధర రూ.33970 ఉండగా 40 శాతం రాయితీపై రూ.20,382కు ఇస్తోంది. గడ్డి విత్తనాలు కూడా 5కిలోలు రూ.460 ఉండగా 75 రాయితీపై రూ.115 అందిస్తోంది.

పాల ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా..

గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమను లాభదాయకంగా మార్చాలన్న లక్ష్యంతో మహిళా సహకార సంఘాల ద్వారా ఆర్థిక పరిపుష్టిని పెంచేందుకు జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని ప్రకటించింది. గ్రామ సచివాలయాల్లో రైతు భరోసా కేంద్రాలను అనుసంధానం చేస్తూ గ్రామస్థాయిలో మహిళా డెయిరీ సహకార సంఘాలను ఏర్పాటు చేసి తద్వారా పాల ఉత్పత్తి కేంద్రాలను ఏఎంసీయూ (ఆటోమేటెడ్ మిల్క్ కలెక్షన్ సెంటర్) ఏర్పాటు చేస్తుంది. ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మండల స్థాయిలో సేకరించిన పాలను నిల్వ ఉంచేందుకు బీఎంసీలు(బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్)లను పక్కా భవనాల్లో నిర్మించేందుకు ప్రణాళిక చేస్తోంది. ఈ సెంటర్ల ద్వారా పాల ఉత్పత్తిని పెంచనుంది. మహిళా సహకార సంఘాల అర్హతను బట్టి వారికి పాల సేకరణ కార్యకలాపాలు అందిస్తారు. వారే రోజుకు రెండు సార్లు పాల సేకరణ, పాల నాణ్యత పరీక్షల నిర్వహణ, సేకరించిన పాలను తరలించడం, అకౌంట్ల నిర్వహణ, ప్రధానంగా పశువుల ఆరోగ్యం, పోషణ, పునరుత్పత్తితో పాటు పాడి రైతులందరికీ సలహాలు సూచనలు ఇస్తారు. వీటిపై పర్యవేక్షణకు వివిధ శాఖల అధికారులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వలంటీర్లు, మండల స్థాయిలో మండల అభివృద్ధి అధికారి, జిల్లా స్థాయిలో కలెక్టర్ నోడల్ అధికారులు ఉంటారు.

5 టన్నుల దాణా అందించాం



ప్రభుత్వం అమలు చేసిన పశువుల పోషణకు సమీకృత దాణా పథకానికి స్పందన లభించింది. ఇప్పటి వరకూ 5 టన్నుల దాణాను రైతులకు అందించాం. అలాగే గడ్డి కోత యంత్రాలు, గడ్డి విత్తనాలు కూడా అందిస్తున్నాం. గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల్లో వెటర్నరీ అసిస్టెంట్ల ద్వారా సేవలు అందుబాటులో ఉన్నాయి.

– బి.చైతన్య, మండల పశువైద్యాధికారి, తొండంగి

తీరిన పశుగ్రాసం కొరత



మాది గోపాలపట్నం గ్రామం. ఐదు పాడి గేదెలు ఉన్నాయి. పశువుల కోసం గత కొంత కాలంగా రాయితీపై దాణాను తీసుకుంటున్నాను. దీని వల్ల పాల ఉత్పత్తి పెరిగింది. గడ్డి విత్తనాల ద్వారా గడ్డిని పెంచుతున్నాను. ఇప్పుడు పశుగ్రాసం కొరత తీరింది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– కటకం శ్రీను, పాడిరైతు, గోపాలపట్నం, తొండంగి మండలం

ఘనంగా త్రిమూర్తుల తీర్థం

తుని రూరల్: చేపూరు శివారు గవరయ్య కోనేరు గ్రామంలో కొలువై ఉన్న త్రిమూర్తుల స్వామి తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది ముక్కనుమ రోజు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో త్రిమూర్తుల తీర్థం నిర్వహించారు. స్థానికులే కాకుండా తుని, రాజుపేట, మర్లపాడు, వి.కొత్తూరు, తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

గ్రామాల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలు

కిర్లంపూడి: మొబైల్ ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బి.సతీష్ బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి 21 తేదీ వరకూ ముక్కొల్లు, సోమవరం, వేలంకలో నిర్వహిస్తారన్నారు. 22, 23న రామచంద్రాపురం, కృష్ణవరం, శృంగరాయునిపాలెం గ్రామ సచివాలయాల్లో జరుగుతాయని తెలిపారు. ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్లు, పిల్లల పుట్టిన తేదీలు, ఇంటిపేర్లు మార్పు, చిరునామా మార్పులు, ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ అనుసంధానం వంటి సేవలు అందిస్తారన్నారు.

పరీక్ష పే చర్చకు వేట్లపాలెం విద్యార్థి

సామర్లకోట: ఈనెల 24 నుంచి 28 వరకు ఢిల్లీలో ప్రధాని మోదీ నిర్వహించే పరీక్ష పే చర్చ–2023కు వేట్లపాలెం గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి తగరంపూడి ఇస్సాకు ఎంపిక అయిన్నట్లు కాకినాడ జిల్లా నాయిబ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు సుందరపల్లి వీపీయస్ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కరపలోని మహాత్మా జ్యోతిభా పూలే రాష్ట్ర వెనుకబడిన గురుకుల పాఠశాలలో 10 తరగతి చదువుతున్నాడని తెలిపారు. విద్యార్థి తండ్రి తగరంపూడి సత్యనారాయణ హుస్సేన్‌పురంలోని ఒక ప్రైవేటు ఫ్యాక్టరీలో పని చేస్తాడన్నారు. ఢిల్లీకి ఈనెల 23న బయలేరుతాడన్నారు. ఇస్సాకు వేట్లపాలెం నాయకులు, నాయిబ్రాహ్మణ సంఘ నాయకులు అభినందించారు.

ఫేస్ యాప్ అటెండెన్స్‌కి శ్రీకారం


తుని మండల పరిషత్‌లో యాప్ ద్వారా ఫేస్ అటెండెన్స్ నమోదు చేస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ

తుని రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫేస్ యాప్ అటెండెన్స్‌కి ఉద్యోగులు శ్రీకారం చుట్టారు. మంగళవారం ప్రభుత్వ ఉద్యోగులందరూ పని చేస్తున్న కార్యాలయాలకు సకాలంలో చేరుకుని ఫేస్ అటెండెన్స్ ద్వారా హాజరును నమోదు చేశారు. రెవెన్యూ, మండల పరిషత్, విద్యా తదితర శాఖలతోపాటు గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు సైతం ఉదయం పది గంటలకు కార్యాలయాలకు చేరుకుని ఎవరి ఫోన్‌లో వారే ఫేస్ అటెండెన్స్ నమోదు చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సమయం ఫేస్ అటెండెన్స్ మొదలు కావడంతో సర్వర్ వేగం కాస్త మందగించింది. దీంతో ఉదయం పది గంటల నుంచి ప్రయత్నించిన కొంత మందికి అరగంట తర్వాత హాజరు నమోదయినట్టు ఎస్‌ఎంఎస్‌లు వచ్చాయి. ఫేస్ అటెండెన్స్ సౌకర్యవంతంగానే ఉందని తుని ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు. విధి నిర్వహణ పూర్తయిన తర్వాత సాయంత్రం ఐదు గంటలకు ఫేస్ యాప్‌లో మరోసారి అటెండెన్స్ వేయాల్సి ఉందన్నారు. ఉదయం 10.30 గంటల తర్వాత 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్‌లో ఫేస్ అటెండెన్స్ నమోదు చేసుకోవచ్చన్నారు. గ్రామ వలంటీర్లు కూడా వారానికి మూడు రోజులు ఫేస్ అటెండెన్స్ వేయాల్సి ఉందన్నారు. ఈ విధానంతో ఉద్యోగుల్లో మరింత పారదర్శకత వస్తుందన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు


యూజే పురంలో చిన్నారులు వేసిన ముగ్గులు

ప్రత్తిపాడు రూరల్: యూజే పురంలో కొత్తూరు కాలువగట్టున వెలసిన సాయిబాబా మందిరం వద్ద సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గొర్లి రాజబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు స్థానికులను అలరించాయి. ఈ పోటీల్లో యూజే పురం, కొత్తూరు గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. విజేతలకు స్థానిక పెద్దలు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. గ్రామ పెద్దలు తేటకాయలు సూకరాజు, అగ్గియ్య, ఒట్టికోళ్ల దివాణం, మామిడాల సూరిబాబు, పగడాల రవణమ్మ, మైనాల శివ, కడిమి కృపానందం, ఆకేటి సత్యనారాయణ, తేటకాయల పూర్ణయ్య, గ్రామ ప్రజలు, సాయి భక్తులు పాల్గొన్నారు.

కె గోపాలపురంలో..

గండేపల్లి: కె.గోపాలపురంలో తదేకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలు జి.మాధవి, జె.వెంకటలక్ష్మి, ఎ.సత్యప్రియ, సి.సత్య, ఎం.మహేశ్వరిలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కర్రి కృష్ణ, బొబ్బర కృష్ణ, అర్జున్, మహాలక్ష్మి, అరిగే శివ, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేయూత మహిళా మార్ట్‌లో లక్కీడ్రా


లక్కీడ్రా విజేతలకు బహుమతులు అంజేస్తున్న బెక్కం చంద్రగిరి

తొండంగి: సంక్రాంతి సందర్భంగా ఎ.కొత్తపల్లిలో ఉన్న చేయూత మహిళా మార్ట్‌లో మంగళవారం లక్కీడ్రా నిర్వహించి, విజేతలకు బహుమతుల అందజేశారు. చేయూత మహిళా మార్ట్‌లో రూ.500పైగా కొనుగోలు చేసిన వినియోగదారులకు లక్కీ కూపన్లు అందజేశారు. గ్రామ సర్పంచ్ బెక్కం రాజా వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి లక్రీడ్రాను తీశారు. దీనిలో ప్రథమ బహుమతిగా వెండి పళ్లెంను పి.ఇ.చిన్నాయపాలెంకు చెందిన వై.సుమ గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతిగా ఎలక్ట్రికల్ కుక్కర్‌ను ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన కె.వి.సుబ్బారావు, తృతీయ బహుమతిగా పట్టుచీరను పి.ఇ.చిన్నాయపాలెంకు ఎందిన వి.భద్ర అందుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం వై.సత్తిబాబు, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యావతి, అడ్డాల సూర్యకాంతం, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు నందెపు చిన్న, ఎలుగుబంటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు


సభలో ప్రసంగిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు

గోకవరం: సంక్రాంతి పండగ ముగిసింది. భోగి పండుగతో మొదలైన ఈ పండగ మంగళవారం ముక్కనుమతో ముగిసింది. ముక్కనుమ రోజున ప్రజలు ఇళ్లలో గ్రామదేవతలకు నైవేద్యాలు సమర్పించారు. నాలుగు రోజుల పండగను ఇంటిల్లపాది ఆనందంగా జరుపుకొని మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో గోకవరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ రద్దీగా మారింది. మండలంలో జూదాలు జరుగకుండా పోలీసులు కట్టడి చేశారు. సాంప్రదాయ బద్ధంగా కోడిపందేలు, ఆటలు మినహా గుండాట, పేకాట వంటివి ఆడకుండా చర్యలు చేపట్టారు. పలు గ్రామాల్లో జూదాలు ఆడేందుకు ప్రయత్నించినప్పటికీ ఎస్సై యూవీ శివనాగబాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారం అందుకుంటూ జూదాలను కట్టడి చేశారు.

ప్రత్తిపాడు: ఏలూరు గ్రామంలో యువశక్తి యూత్ సభ్యులు ఐదు రోజుల పాటు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సంబరాల్లో ప్రతి రోజూ కబడ్డీ, ఖోఖో, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర వంటి సాంఘిక, పౌరాణిక, జానపద తదితర సాంస్కృతిక కళా రూపాలను ప్రదర్శించారు. సోమవారం రాత్రి మాజిక్ షో, మిమిక్రీ, డీజే ఈవెంట్స్ జరిగాయి. పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దాడిశెట్టి రాణి, మాజీ సర్పంచ్ జామి మాణిక్యం, వైఎస్సార్ సీపీ నాయకులు దాడిశెట్టి చక్రధర్, యూత్ ప్రతినిధులు రొంగల ఈశ్వరరావు, యువశక్తి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


శంఖవరంలో పూర్వ విద్యార్థులు

శంఖవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు మంగళవారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. చదువు అనంతరం వివిధ ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన వారంతా ఒక చోటుకు చేరి రోజంతా సందడి చేశారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు. తమ సహచరులలో కోల్పోయిన మిత్రుడు మైనం రామకృష్ణ కుటుంబానికి గాది కొండబాబు, కుర్రె పద్మావతి, వట్టికోల శ్రీనివాసు, దర్శిపూడి సూర్యలక్ష్మి, ఇతర మిత్రులు కలిసి రూ.40వేల సహాయం అందించారు.

సందడే సందడి..


దారపల్లి జలపాతం వద్ద యాత్రికుల సందడి

ప్రత్తిపాడు రూరల్: సంక్రాంతి సందర్భంగా గత నాలుగు రోజులుగా దారపల్లి జలపాతానికి యాత్రికులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ దారపల్లి వైపు వాహనాల జోరు కొనసాగింది. దీంతో దారపల్లి జలపాతం కిటకిటలాడింది. గత ఏడాది కన్నా ఈ ఏడాది యాత్రికుల సంఖ్య రెట్టింపయ్యింది. ప్రస్తుతం సాదారణ రోజుల్లోనే దారపల్లి జలపాతానికి యాత్రికుల తాడికి కొనసాగుతుంది. ఇక పండగ వేళ కావడంతో పిల్లా పాపలతో భారీ ఎత్తున తరలివచ్చి ఆనందంగా గడిపారు. అయితే ఇక్కడ రహదారి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో యాత్రికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జగ్గంపేట: మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి చెందగా మరొక యువకుడుకి తీవ్ర గాయాలయ్యాయి. జగ్గంపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లిసాలకు చెందిన మమ్మన క్రాంతికుమార్ ద్విచక్ర వాహనంపై ఆ గ్రామానికి వెళుతుండగా రాజుపూడికి చెందిన తాతపూడి పవన్‌కుమార్(17) జగ్గంపేట వైపు వెళుతున్నాడు. ఇద్దరు జె.కొత్తూరు గ్రామ శివారు అమ్మవారి ఆలయం సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పవన్‌కుమార్ మృతి చెందగా క్రాంతికుమార్‌ను కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు పేర్కొన్నారు.

పాన్‌షాపులో అగ్ని ప్రమాదం

సామర్లకోట: స్థానిక పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని పాన్‌షాపులో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. పెద్దాపురానికి చెందిన వాసు రాక్ సిరామిక్స్ ఎదురుగా పాన్‌షాపుతో కలిపి చిన్న హోటల్ ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నాడు. ముక్కనుమ పండగ కావడంతో వ్యాపారితో పాటు కూలీలు కూడా సెలవు తీసుకున్నారు. దాంతో షాపులో ఎవరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. గుర్తు తెలియని వ్యక్తులు పాన్‌షాపునకు నిప్పు పెట్టారనే విమర్శలు ఉన్నాయి.

మృత్యు మార్గాలు.. హైవే జంక్షన్లు..

- నిబంధనలు పాటించక తరచూ ప్రమాదాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు


హెచ్చరిక బోర్డులు లేని హైవే జంక్షన్

ఏలేశ్వరం: నిత్యం ప్రయాణించే జాతీయ రహదారులపై జంక్షన్లు ప్రమాదాలకు చిరునామాగా మారుతున్నాయి. ఇటీవల తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అతివేగం, నిబంధనలు పాటించకపోవడంతో వంటి వాటి వల్ల ఇంటి నుంచి బయలుదేరే వారు గమ్యం చేరేలోపే మృత్యుఒడిలోకి చేరుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారి జంక్షన్లలో పలువురు మృత్యువాత పడుతుండడంతో పలు కుటుంబాలు అనాథిగా మిగులుతున్నాయి. ఏలేశ్వరం మండల పరిధిలోని యర్రవరం, చిన్నింపేట, ప్రత్తిపాడు గ్రామంలోని వెళ్లేదారి, వచ్చేదారి, రాచపల్లి అడ్డురోడ్డు, శంఖవరం మండలంలోని కత్తిపూడి, అన్నవరంలలో జాతీయ రహదారులపై జంక్షన్లు ఉన్నాయి. వీటి వద్ద హైవే అధికారులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని ప్రమాదాల్లో కొందరు క్షతగాత్రులవుతుండగా మరొ కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా చిన్నింపేట, కత్తిపూడి గ్రామాల జంక్షన్ల వద్ద ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

జాతీయ రహదారిపై నిబంధనలు కచ్చితంగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వాహనదారుల్లో అవగాహన కల్పించేలా జాతీయ రహదారిపై అవగాహన సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడే కాకుండా నిబంధనలు పాటించకపోయినా కఠినచర్యలు తీసుకొనేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన కావమ్మ తిరునాళ్లు


కావమ్మ, మారెయ్యలను దర్శించుకున్న భక్తులు

సామర్లకోట: స్థానిక రజకపేటలో ఏలేరు కాలువ ఆవలి వైపు ఉన్న కావమ్మ ఆలయం వద్ద సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిర్వహించిన తిరునాళ్లు మంగళవారం ముక్కనుమతో ముగిశాయి. పట్టణ పరిధిలోని అనేక గ్రామాల రైతులు, వ్యవసాయకూలీల కుటుంబాల వారు కావమ్మ, మారెయ్యలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలను ఆకర్షించడానికి వివిధ రకాల గేమ్స్ ఏర్పాటు చేశారు. ఆలయం సమీపం నుంచి పీబీసీ కెనాల్ వెళ్లడంతో దానిలో ఎయిర్ బాల్స్ ఏర్పాటు చేసి పిల్లలు ఆడుకునేలా చేశారు. ఏటా ఆలయం వద్ద నంబరు గుండాట ఏర్పాటు చేసే వారు. గుండాట ఏర్పాటు చేయడానికి వీల్లేదని పోలీసులు హెచ్చరికలు జారీ చేయడంతో ప్రశాంతంగా తిరునాళ్లు జరిగాయి. ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని ఈనెల 22న అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు సుకపట్ల నాగేశ్వరరావు, ఆదినారాయణ తెలిపారు.